క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



గణపురం : నూతన ఎస్సైగా మచ్చ సాంబమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

వరదకు కొట్టుకొచ్చిన కంటైనర్



మల్హర్: వరద ప్రవాహంతో ఓ కంటైనర్ మండలంలోని తాడిచర్ల మానేరు వైపు శనివారం కొట్టుకొచ్చింది. రెండు రోజులు పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో తాడిచర్ల మానేరు కంటైనర్ కొట్టుకొచ్చి, వంతెన కింది ఫిల్లర్ వద్ద ఆగింది. వరద తగ్గడంతో మానేరు వైపు వెళ్లి గ్రామస్తులు కంటైనర్‌ను గుర్తించి సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. కొయ్యూరు ఎస్సై వి.నరేష్ అక్కడికి చేరుకొని కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సర్పంచ్ కుటుంబానికి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



మొగుళ్లపల్లి: స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు తల్లి రాధాబాయి ఇటీవల మృతి చెందగా శనివారం బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ధర్మారావు కుటుంబాన్ని పరామర్శించి రాధాబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి,జెడ్పీటీసీ జోరుక సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, సర్పంచులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ కుటుంబానికి ఆర్థిక సాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని తిరుమలగిరికి చెందిన ఆర్‌ఎంపీ మాచర్ల వెంకటేశ్వర్లు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఆయన కుటుంబ సభ్యులను రేగొండ సొసైటీ డైరెక్టర్ చల్లగురుగుల సుదర్శన్ పరామర్శించి ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట వార్డు సభ్యులు మాచర్ల నాగమణిమురళి, డీలర్ రవి, వెంకట్రాజం, మండల తిరుపతి, పల్నాటి సాయి, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలోని జాతీయ రాహదారిపై శనివారం ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పల్లె ప్రకృతి వనం సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

రోడ్లపైనే సంచరిస్తున్న పశువులు



మహదేవపూర్ : మండల కేంద్రంలో జాతీయ రాహదారిపై రాత్రి వేళల్లో పశువులు సంచరిస్తూ రోడ్డు మీద ఉంటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా పశువులను యజమానులకు అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కొత్తపల్లి (గోరి)లో...



టేకుమట్లలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



మహదేవపూర్‌లో..

కులమతాలతీకంగా ఐక్యతను చాటుకునే మొహర్రం టేకుమట్ల, రేగొండ, కాటారం, మహదేవపూర్ మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం జరిగే పండుగలో భక్తులు పాల్గొని పీరీలకు కుడుకలు, బెల్లం, దట్టీలు కట్టి, పూలు సమర్పించి తమ మొక్కులను సమర్పించుకున్నారు. ముస్లింలు పీరీలను ఎత్తుకుని వాడవాడలా తిరిగారు. అమరులైన త్యాగాలకు గుర్తుగా ఈ మొహర్రం నిర్వహిస్తూ హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని ముస్లిం మతపెద్దలు అన్నారు. టేకుమట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై చల్ల రాజు, రామకిష్టాపూర్(టి) సర్పంచ్ గునిగంటి మహేందర్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కాటారంలో..

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

● టీపీసీసీ సభ్యుడు సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్ల పల్లె బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటిని కలియ తిరిగి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ సాయం క్రింద రూ.50 వేలు అందించాలని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అనంతరం బాధితులకు దుస్తులు అందజేశారు. అలాగే దొమ్మనపల్లి చెరువు కట్టకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఇలా జరిగిందని ఆరోపించారు.

చెరువు కట్టలను నిర్మించి ఆదుకోవాలి

మండలంలోని నవాబుపేట, చిట్యాల చెరువు కట్టలను నిర్మించి రైతులను ఆదుకోవాలని గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. చెరువులు గండ్లు పడడంతో వాటి కింద పొలాల్లో ఇసుక మేటలు, మట్టి, బండరాళ్లు వచ్చాయని అన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ. 2 లక్షల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చెరువు కట్టలకు తక్షణమే ఇసుక బస్తాలు, రింగ్‌బండ్ వేసి కట్టలను పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని కోరారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

టేకుమట్ల: బ్రిడ్జి కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే టేకుమట్ల చలివాగుపై



చిట్యాల : బాధితులకు బట్టలు అందజేస్తున్న గండ్ర సత్యనారాయణరావు

నిర్మించిన హైలెవల్ వంతెన కూలిపోయిందని, అందుకు కారణమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం చలివాగుపై కూలిన వంతెనతో పాటు పంటనష్టాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఐదేళ్లకే వంతెన కూలడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పాలకులు, అధికారుల నిరక్ష్యం మూలంగానే వంతెన కూలిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ, వంతెన పునర్నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేయాలని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వైనాల రవీందర్, మోతె రాజమౌళి, కొమురయ్య, శాస్త్రాల కిరణ్, అల్లం ఓదెలు, క్రాంతి, రాజు, సతీష్, రాజు, దాసరి సంపత్, తదితరులు ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



పీహెచ్‌సీ ఎదుట ఆందోళ చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

కాటారం: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శనివారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట రెండో ఏఎన్‌ఎంలు ఆందోళన చేపట్టారు. దీర్ఘకాలికంగా పని చేస్తున్న తమను ప్రభుత్వం రాతపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, చాపలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్ : వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన మండలంలోని మోరంచపల్లి వరద బాధితులకు శనివారం ఇంటింటికి బీజేపీ నాయకులు చెద్దర్లు, దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తి సత్యపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కో–కన్వీనర్ చాడ రఘునాథ రెడ్డి, జిల్లా నాయకులు ముడుపు అశోక్‌రెడ్డి, మనోహర్, బీజేవైఎం నాయకులు గాలిఫ్, జంజర్ల సురేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు నిత్యావసస సరుకులు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

భూపాలపల్లి రూరల్ : భారీ వర్షాలతో అన్ని కోల్పోయిన మోరంచపల్లి గ్రామస్తులకు ది కాకతీయఖని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులకు, అలాగే గుమస్తాలతో పాటు గ్రామంలోని చెంచులకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌చందు నాయక్, ప్రధాన కార్యదర్శి బిల్లా అశోక్‌రెడ్డి, కోశాధికారి బేతు రమేష్, సహాయ కార్యదర్శి గండి చిరంజీవి, సీనియర్ లారీ ఓనర్స్ వెంకట్రావు, పుట్ట రవి, జనగాం శ్రీనివాస్, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ప్రశాంత్

మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తనయుడు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్ మోరంచపల్లి బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇంటింటికీ వెళ్లి దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోరంచపల్లి గ్రామస్తులకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్సీ సిరికొండ సీఎం కేసీఆర్‌తో ప్రత్యేకంగా గ్రామ సమస్యలు చెప్పి సాయం అందేలా చూస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన వెంట యూత్ నాయకులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలిప్పించాలని మంత్రికి వినతి

ఏటూరునాగారం : మండలంలోని ఏటూరునాగారం గ్రామానికి చెందిన 150 మంది గ్రామస్తులు తరచూ వరద ముంపునకు గురవుతున్న క్రమంలో తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ఐటీడీఏ గెస్ట్ హౌజ్ వద్ద మంత్రిని వారు కలిసి సమస్యను వివరించారు. 1983లో వచ్చిన వరదలకు ఇళ్లు కొట్టుకుపోయాయని, 1986లో వరదలు రాగా సినిమా థియేటర్‌లో తలదాచుకున్నామని, 1992లో వచ్చిన వరదలకు అడవుల్లో చెట్ల మీద ఉన్నామని వాపోయారు. ప్రస్తుతం వైటీసీలో తలదాచుకున్నట్టు తెలిపారు. వరదలు వచ్చినప్పుడల్లా గ్రామాన్ని వదిలి ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సి వస్తోందని చెప్పారు. సురక్షితమైన ప్రభుత్వ స్థలం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు ముత్యంబాయి, శ్రీను, రామయ్య, రాములు, సమ్మయ్య, లక్ష్మి, అశోక్, మంగ, లక్ష్మయ్య, రవి తదితరులున్నారు.



వినతిపత్రాలతో గ్రామస్తులు

బస్టాండ్‌లోనే ఆర్టీసీ బస్సులు

● మూడ్రోజులుగా డ్రైవర్లు, కండక్టర్ల పడిగాపులు

ఏటూరునాగారం : ఏటూరునాగారానికి చేరుకున్న 12 ఆర్టీసీ బస్సులు భారీ వర్షాలకు గుండ్లవాగు ప్రాజెక్టు కొట్టుకుపోగా వరంగల్–ఏటూరునాగారం మధ్య రాకపోకలు నిలిచిపోయి మండల కేంద్రంలోని బస్టాండ్‌లోనే ఉండిపోయాయి. దీంతో డ్యూటీలో ఉన్న 30 మంది కండక్టర్లు, డ్రైవర్లు రహదారులపై రాకపోకలు ప్రారంభించడానికి మూడ్రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. పస్రా వద్ద రోడ్డు నిర్మాణం పూర్తయితే తప్ప బస్సులు, డ్రైవర్లు, కండక్టర్లు గమ్యస్థానానికి చేరుకునే అవకాశం లేదు. రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేసి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని కండక్టర్లు, డ్రైవర్లు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ లైన్‌మెన్ ఔదార్యం

ఏటూరునాగారంలో చిక్కుకుపోయిన 25 మంది ఆర్టీసీ కండక్టర్లకు, డ్రైవర్లకు శనివారం విద్యుత్ శాఖ లైన్‌మెన్ కొండ సమ్మయ్య భోజనాలు అందించి ఔదార్యం చాటుకున్నారు.



బస్టాండ్‌లోనే ఉన్న ఆర్టీసీ బస్సులు

సహాయక చర్యల్లో పోలీసులు

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మోరంచపల్లి భారీ వర్షాలకు వాగు ఉధృతికి గ్రామం మొత్తం జలదిగ్బంధం కాగా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో మోరంచపల్లి గ్రామంలో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రాణాలకు తెగించి వృద్ధులను నీటి నుంచి రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వృద్ధులను రక్షించేందుకు నేరుగా పోలీసులు భుజాలపైకి ఎక్కించుకుని మోసుకుంటూ వరదల బారి నుంచి రక్షించారు.



మోరంచపల్లి సహాయక చర్యల్లో వృద్ధుడిని మోసుకొస్తున్న రేగొండ పోలీసులు

ఐదేళ్లకే కూలిన వంతెన!



కూలిన వంతెన

టేకుమట్ల: టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై వంతెన నిర్మాణానికి 2013 డిసెంబర్‌లో రహదారులు, భవనముల శాఖ ద్వారా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా రూ.1595లక్షల వ్యయంతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి వంతెన నిర్మాణం వేగంగా కొనసాగినా అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు 2017లో అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రత్యేక చొరవతో 2017 నుంచి మొదలైన అప్రోచ్ రోడ్డును అనతి కాలంలోనే పూర్తి చేసి 2018 మార్చి లో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి అప్పటి స్పీకర్ సిరికొండ ప్రారంభించారు. వంతెన కూలడానికి ఇంజనీర్ల తప్పిదమా.. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడమా అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఐదు సంవత్సరాల క్రితం నిర్మించిన హైలెవల్ వంతెన కూలిపోవడం చర్చనీయాంశమైంది. వంతెన పిల్లర్ కుంగడంతో ఫిల్లర్‌పై గల స్లాబ్ కూలిపోయి వంతెన నిర్మాణంలో సాయిల్ టెస్ట్ చేయలేదని, పిల్లర్ లోతు తక్కువగా తీయడంతో వరదలకు పిల్లర్ కుంగిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు ఇంజనీర్ల పర్యవేక్షణ లోపంతో పాటు, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే వాదన బలంగా వినిపిస్తుంది. వంతెన కూలడానికి ప్రకృతి వైపరీత్యమా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ప్రకృతి వైరీత్యమే అయితే ఎన్నో చోట్ల వంతెనలు నిర్మించారు. భీకర ప్రవాహాలను సైతం తట్టుకుని వంతెనలు నిలదొక్కుకుంటున్నాయని, ఒక్క రోజు వరద తాకిడికే వంతెన కూలిపోవడం ఏంటని చర్చించుకుంటున్నారు. ఇది ముమ్మాటికీ ఇంజనీర్ల తప్పిదమేనని చెబుతున్నారు.

వర్షాకాలంలో రైతులు మెలకువలు పాటించాలి

టేకుమట్ల(రేగొండ): వర్షాకాలంలో రైతులు మెలకువలు పాటించి, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాలని రేగొండ మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం రేగొండ మండలంలోని రామన్నగూడెం, నారాయణపూర్, సుల్తాన్‌పూర్, తిరుమలగిరి, రామన్నగూడెంతండా, భాగిర్తిపేట, మడ్తపల్లి, లింగాల కనిపర్తి, దామరంచపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. పత్తి రైతులు అప్రమత్తంగా ఉంటూ మొక్క అడుగు భాగాన నీటి నిల్వలను నివారించి తేమను తగ్గించాలన్నారు. ప్రస్తుతం యూరియాతో పాటు పొటాష్‌ను మొక్కలకు వేయాలని సూచించారు. అధిక వర్షాలతో నల్ల నేలల్లో వేరు కుళ్లే ప్రమాదం ఉంది. వరి రైతులు వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ విధానంలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వాసుదేవరెడ్డి

24వ రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె



మొగుళ్లపల్లి : సమ్మె చేస్తున్నజీపీ కార్మికులు



కాటారంలో..

మొగుళ్లపల్లి: పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శనివారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ ఈ నెల 31న జరిగే మంత్రి మండలి సమావేశంలో మా న్యాయమైన డిమాండ్లను చర్చించి పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీపీ ఉద్యోగులు క్యాతరాజు రాజయ్య, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం క్రిష్టయ్య, చేలిక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: తమ డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామ పంచాయితీ కార్మికులు సమ్మెలో భాగంగా రోజుకో విధంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జీపీ కార్మికులు పచ్చ గడ్డి తింటూ విన్నత్న రీతిలో నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు దీక్ష విరమించేది లేదన్నారు. కాగా గుమ్మాళ్లపల్లిలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా సర్పంచ్ కుమారుడు బ్లీచింగ్ చల్లిస్తుండగా కార్మికులు ట్రాక్టర్‌కు అడ్డుగా పనుకొని పనులు నిలిపివేయించారు. చిద్నెపల్లి జీపీలో సర్పంచ్ రాజమౌళి ప్రైవేట్ కూలీలతో పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా కార్మికుల జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల జేఏసీ నాయకులు చిట్యాల శశికుమార్, దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్, ఇనుగాల కొండయ్య, దేవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మేటలు వేసిన పొలాల పరిశీలన

మల్హర్: భారీ వర్షాల కారణంగా వల్లెకుంట శివారులోని ఇసుక మేటలు, బురదమయమైన పంట పొలాలను తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేటలతో నిండిన పొలాలను, వరదల్లో కొట్టుకుపోయిన విద్యుత్ మోటార్లు, స్తంభాలు, పైపుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహించి నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్, జెడ్పీటీసీ అయిత కోమలరాజిరెడ్డి, సర్పంచ్ శనిగరపు రమేష్ ఉన్నారు.



రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్